క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జట్టు ఎంపిక

పెనుమంట్ర: మార్టేరులో ఈ నెల 29 నుంచి అక్టోబరు 2వ తేదీవరకు రాష్ట్రస్థాయిలో జరిగే అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఈపోటీలను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు కప్ పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు జిల్లా కమిటీ సభ్యులు కర్రి వినాయక రెడ్డి(మార్టేరు) ఇ.సత్యకిరణ్ (ఏలూరు)జట్టును ఎంపిక చేశారని అన్నారు. జట్టు కెప్టెన్ ఐబీవీసీ హెచ్ కుమార్‌వర్మతోపాటు పి.గణేష్, కె కుమార్‌రవితేజరెడ్డి, కె.మణికంఠరెడ్డి(మార్టేరు) మను సందీప్, కె లోకేష్, ఎం శివ(భీమవరం), కె.ఎలిషా, టి.మోహనకుమార్(ఏలూరు), ఎ సాయిరామ్, ఏ దుర్గామణికంఠ (నరసాపురం), డి.ఆసీష్(తాడేపల్లిగూడెం) ఎంపిక చేశామని వివరించారు.

నరసాపురం రూరల్ ఎస్సైగా మూర్తి

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ ఎస్సైగా ఏజియస్ మూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆచంట, నరసాపురం రూరల్, పాలకోడేరు, కాళ్ల పోలీస్ స్టేషన్లలలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. గతంలో నరసాపురం రూరల్ స్టేషన్‌లో పనిచేసిన ఆయన మళ్లీ తిరిగి ఎస్సైగా బాధ్యతలు చేపట్టడంతో సిబ్బందితోపాటు స్థానికులు, ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని వివరించారు.

బాలలే జాతి పురోగతికి ఆధారం

పెనుగొండ: జాతి పురోగతి ఆధారమైన బాలల స్వేఛ్ఛా జీవితాన్ని పెడత్రోవ పట్టకుండా కాపాడి, వారిని సరైన మార్గంలో నడపడానికి బాల వికాస్ కేంద్రాలు దోహదపడతాయని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి విభాగ్ కన్వీనరు చింతకుల గోపాల కృష్ణ అన్నారు. పెనుగొండ మండలం నడిపూడి మిద్దేవారిపాలెంలోని బండారక్కమ్మ తల్లి దేవాలయంలో సోమవారం చవితి వేడుకలు నిర్వహించి బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు.టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా ఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హరిజన, గిరిజన మత్స్యకార గ్రామాల్లో రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో ఒకే రోజున, ఒకే సమయానికి 374 బాల వికాస్ కేంద్రాలు ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనరు పొదల సూరిబాబు, ఆలయ అర్చకులు బిరుదుకోట సుబ్రహ్మణ్యం, కోమటి సాయి కిషోర్ తదతరులు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో వెలగలవారిపాలెం రోడ్డులో అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేస్తున్న గ్రామపంచాయతీ మంచినీటి చెరువును మంగళవారం గ్రామ సర్పంచ్ తాటిపర్తి ప్రియాంక పరిశీలించారు. మంచినీటి చెరువును అభివృద్ధి పరిచేందుకు ఈ ఏడాది రూ. 1.80 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో తవ్వకం పనులు పూర్తిచేశారు. ఈ చెరువుకు మెయిన్‌రోడ్డు ప్రక్కన గతంలోనే గ్రామపంచాయతీ నిధులతో రేవును నిర్మించారు. ఈ చెరువుకు సమీపంలోనే రాజన్న రంగరాజు నగర్ ఉండటంతో ఆ కాలనీవాసులకు వినియోగించుకునే విధంగా గ్రామానికి చెందిన దాత దొంగ నాగరాజు రూ. 80 వేలు వెచ్చించి తూర్పు వైపు గట్టుకు మరో రేవును నిర్మించారు. బ్రాహ్మణచెర్వు వాసులు మంచినీటి అవసరాలు తీర్చేందుకు ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పెనుమంట్ర-2 ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, ఉప సర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

మొగల్తూరు: తీరం వెంబడి ఉన్న సీఆర్‌జెడ్(సముద్ర తీర నిషేధిత ప్రాంతం)లో ఉన్న ఆక్రమణలను మంళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. మోళ్ళపర్రు నుంచి కేపీ పాలెం బీచ్ వరుకు తీరం పొడవునా సుమారు 20 ఎకరాలు వరుకు ఆక్రమించుకుని కొబ్బరి ,సరుగుడు చెట్లను స్థానిక మత్స్యకారులు పాతుకున్నారు. గతంలోను ఒకసారి మొక్కలు నాటితే అధికారులు తొలగించి మరోసారి మొక్కలు నాట వద్దని అధికారులు హెచ్చరించారు. అయినా అధికారుల మాట వినకుండా మొక్కలు నాటారు. తీరం పొడవునా బీచ్‌ల అభివృద్ధికి టూరిజం శాఖకు అప్పగించారు. టూరిజం శాఖ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. దీంతో ఆక్రమణలో ఉన్న మొక్కలు తొలగించి చదును చేసి టూరిజం శాఖకు అప్పగించాలని నిర్ణయించుకోవడంతో రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో ఆక్రమణలోని మొక్కలు తొలగించే పనులు చేపట్టారు. తహసీల్దార్ జి అనితా కుమారి, డీఎస్పీ రవిమనోహార ఆచారి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఎస్సైతో పాటుటు, సిబ్బందితో ముందు జాగ్రత్తగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేడు వాలీబాల్ పోటీలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన క్రీడాకారులకు కొడమంచిలిలోని ఉన్నత పాఠశాలలో బుధవారం వాలీబాల్ పోటీలు నిర్వహించి, క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. మంగళ వారం విలేకర్లతో మాట్లాడుతూ అండర్ -14 బాల, బాలికలు, అండర్ -17 బాల, బాలికలకు ఎంపిక జరుగుతుందని తెలిపారు.

వైభవంగా చవితి వేడుకలు



గునుపూడి గాంధీ నగర్‌లో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



కాళ్ల మండలం జువ్వలపాలెంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): వినాయక చవితి పండుగను భీమవరం పట్టణంలో వాడవాడలా సోమవారం, మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రధాన సెంటర్లలో మండపాలను ఏర్పాటు చేసి వినాయకుడిని కొలువుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో నిర్వహించిన వినాయక చవితి మహోత్సవాల్లో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వినాయక చవితి మహోత్సవాలను పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే గ్రంధి రవితేజ పట్టణంలో పలు వార్డుల్లో నిర్వహించిన వినాయక చవితి మహోత్సవాల్లో పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరవాసరంలో

వీరవాసరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న వినాయక ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మామిడి తోరణాలు, చలువ పందిళ్లతో, విద్యుత్ కాంతుల దీపాలతో మండపాలన్నీ కళకళలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని తీర్థం ప్రసాదాలను స్వీకరించారు. మండపాల వద్ద ఆద్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

భీమవరం మండలంలో...

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, వెంప, తాడేరు, బేతపూడి, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, లోసరి, రాయలం, చినఅమిరం తదితర గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడవాడలా, వీధివీధినా చిన్నారులు, పెద్దలు తారతమ్యం లేకుండా మండపాలు ఏర్పాటు చేసి చలువ పందిళ్లతో గ్రామాల్లో చవితి సందడి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక వెలంపేటలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పూజలు చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పూలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ గణేష్ విగ్రహాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వనువులమ్మ అమ్మవారి ఆలయం వద్ద అగ్నికులక్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలోనూ, తీగల దొడ్డి రామాలయం వద్ద, శాంతినగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద, పల్లెవీధి, అయిభీమవరం రోడ్డు, పెద్దింటి అమ్మవారి ఆలయం సమీపంలో వీరాంజనేయ యువజన సంఘం ఆధ్వర్యంలోనూ, పలు చోట్ల ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు.

ఉండి: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వీధి వీధినా ప్రతిష్టించిన గణనాధుని విగ్రహాల వద్ద మంగళవారం ఉందయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదేవిధంగా భజన, భక్తిగీతాలు, ప్రవచన కార్యక్రమాలు, పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాళ్ల మండలంలో..

కాళ్ల: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గణనాధునికి భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జువ్వలపాలెం, ఏలూరుపాడు, కాళ్ళకూరు, దొడ్డనపూడి గ్రామాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే కాళ్ళ, సీసలి, బొండాడ, పెద అమిరం, కలవపూడి తదితర గ్రామాల్లో చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో మంగళవారం పేకాడుతున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉండి మాజీ సర్పంచ్ మృతి

ఉండి: ప్రముఖ రైతు ఉద్యమ నాయకుడు, ఇంజినీర్, ఉండి గ్రామ మాజీ సర్పంచ్ గొట్టుముక్కల అర్జునరాజు(90) మంగళవారం మధ్యాహ్నం ఆయన స్వగృహంలో మృతి చెందారు. 1982-87 మధ్య ఉండి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉండి లయన్స్ క్లబ్ ప్రతినిధులు గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, కలిదిండి సీతారామరాజు, పొలతీర్థపు నరసింగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

మునిసిపల్ పార్కుల అభివృద్ధికి కృషి



భీమవరంలోని క్యాంపు కార్యాలయం నుంచి పార్కులోని విద్యుత్ సౌకర్యాన్ని వర్చ్యువల్ విధానంలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు మునిసిపల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి టుటౌన్‌లోని ఏఎస్‌ఆర్ నగర్ పార్కులో రూ.7 లక్షల మున్సిపల్ నిధుల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ వర్చ్యువల్ విధానంలో ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. పట్టణంలోని పార్కులన్నింటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని దీనిలో భాగంగా పార్కుల్లో వాకింగ్ ట్రాక్ లను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామని దీనికి పట్టణ ప్రజల సహకారంతో ఎంతో అవసరమన్నారు. గత నాలుగేళ్లుగా పట్టణంలో అనేక చోట్ల సీసీ డ్రైన్లు, రోడ్లను నిర్మించడంతో ప్రజలకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జేసీఎస్ కన్వీనర్లు కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్, కొమరాడ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ మద్దాల రమణ, తుందుర్రు సర్పంచ్ ఆరేటి వీరస్వామి నాయుడు, మునిసిపల్ ఇంజినీర్ త్రినాథరావు, డీఈ కె అప్పలరాజు, ఏఈ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల వినతి

అగ్రిగోల్డ్ బాధితులకు జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, ఎం.సీతారాంప్రసాద్, చెల్లబోయిన రంగారావు, చికిలే పుష్పకుమారి, వై వీరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కుతో భరోసా



తరటావలో పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను)

ఆకివీడు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం దేశ చరిత్రలోనే మైలురాయి వంటిదని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) అన్నారు. మండలంలో సర్వే పూర్తయిన అజ్జమూరు, తరటావ గ్రామాల్లోని భూ హక్కుదారులకు శాశ్వత పట్టాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ డ్రోన్ కెమెరా ఆధారంగా సర్వేను పారదర్శకంగా నిర్వహించారని చెప్పారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ పట్టా పొందిన రైతు తన భూమిని విక్రయించుకుంటే దానిని సబ్ డివిజన్ చేసి, తహశీల్దార్, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ లాగిన్‌లోకి వెళ్లుతుందన్నారు. తదనంతరం భూమి రిజిస్ట్రేషన్ అవుతుందని చెప్పారు. తహశీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ డ్రోన్ సర్వే అనంతరం అజ్జమూరు, తరటావ గ్రామాల్లో 2.15 ఎకరాలు, 3 ఎకరాలు చొప్పున భూమి తక్కువ వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, సర్పంచ్‌లు చెలంకూరి చలపతిరావు, కూనపరాజు ప్రసాదరాజు, కఠారి కేశవరావు, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

సాక్షి, భీమవరం: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు ఆమోదించడాన్ని సీపీఐ స్వాగతిస్తున్నట్లు ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. మంగళవారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్లకు మాజీ ఎంపీ, భారత జాతీయ మహిళా సమాఖ్య మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి గీతా ముఖర్జీ పోరాట ఫలితమేనన్నారు. ముందుగా గీతాముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారత, సమానత్వ సాధనకు మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ 1996 దేవెగౌడ ప్రభుత్వంలో సీపీఐ ఎంపీ గీతాముఖర్జీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బిల్లు ఆవశ్యకతను సభలో వివరించి బిల్లు ఆమోదానికి పట్టుపట్టారన్నారు. ఎట్టకేలకు 27 సంవత్సరాల నిర్విరామ పోరాట ఫలితంగా మహిళా రిజర్వేషన్ బిల్లు కేంద్ర కేబినెట్ ఆమోదించడం హర్షణీయమన్నారు. సమావేశంలో మహిళా సమాఖ్య నాయకురాండ్రు జి.మరియమ్మ, జి.శ్వేత, బి.హారిక, బి.స్వర్ణలత, కె.బ్లెస్సీ, కె.గ్రేసీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేతో ప్రజారోగ్యానికి భరోసా



మాదివాడలో సర్వే చేస్తున్న ఏఎన్ఎంలు, నాయకులు

ఆకివీడు: ఇంటింటా సర్వేతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు చెప్పారు. స్థానిక మాదివాడ, మండలంలోని చిన కాపవరం, అప్పారావుపేట గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మంగళవారం ఆయన ప్రారంభించారు. పండు మాట్లాడుతూ బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కార్యక్రమం ఎంతో మేలు చేయనుందని చెప్పారు. వైద్యనిపుణులతో ఈనెల 30వ తేదీ నుండి ఆయా సచివాలయాల వద్ద వైద్య సేవలు లభిస్తాయని చెప్పారు. మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ప్రచారాలు



దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే నిమ్మల జీర్ణించుకోలేక పోతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో రూ.475 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను మంగళవారం గోపి పరిశీలించారు. రోడ్లు నిర్మాణం, ఫిల్లర్లు ఏర్పాటు, సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్, తాత్కాలిక షెడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా గోపి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నిమ్మల ఇటీవల మెడికల్ కళాశాలను సందర్శించి ఖాళీగా ఉన్న వరి చేలల్లో సెల్ఫీలు తీసుకుని అసత్య ప్రచారం చేశారని దుయ్యబట్టారు. కళాశాల పనులను స్వయంగా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అబద్ధాలుగా చిత్రీకరించి, ఫేక్ వీడియోలు తీసి వైరల్ చేయడం ఎమ్మెల్యే మానుకోవాలని హెచ్చరించారు. ఏపీఎంఎస్ఐడీసీ డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు సంబంధించి 200 ఫిల్లర్లు 27 మీటర్ల లోతు, 7.5మీటర్లు విస్తీర్ణంలో నిర్మిస్తున్నామని గోపి తెలిపారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ రెండేళ్ల కాలపరిమితిలో పనులు పూర్తి చేసి అప్పగించనున్నట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వ పనులు పూర్తి చేస్తుందన్నారు.

ప్రభుత్వాసుపత్రి సందర్శన

రూ.13కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి సందర్శించారు. పనులు మరో రెండు నెలల్లో పూర్తి చేయనున్నట్లు సంబంధిత అధికారులు వివరించారు. ఫిల్లింగ్, రోడ్లు, ఇతర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గోపి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం ఆసుపత్రి మెయిన్‌రోడ్డును అత్యవసరంగా మరమ్మతులు చేయనున్నట్లు గోపి హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, వైస్ ఎంపీపీలు యన్నాబత్తుల నాగేశ్వరరావు, పడవల సునీల్‌బాబు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు ఎం మైఖేల్‌రాజు, చందక సత్తిబాబు, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్శి వెంకటరత్నం, మోర్త గిరీష్, ఖండవల్లి వాసు, మద్దా చంద్రకళ, కర్రా జయసరిత, చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించేందుకు కృషి



మొగల్తూరు: ఓహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఒక్కరికీ స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు కృషి చేస్తున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీలో రూ.61.96 లక్షలతో నిర్మాంచిన రెండు ఓహెచ్ఎస్ఆర్‌లను, రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ.65.42 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్‌లు, ఓహెచ్ఎస్ఆర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో నరసాపురం మండలం, మొగల్తూరు మండలంలో రూ.20 కోట్లు వెచ్చించామన్నారు. రెండో విడతలో మరో రూ.20 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామన్నారు. అంతే కాక జగనన్న కాలనీలో తాగునీటి అవసరాల కోసం మరో రూ.18 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్ నిదులు వెచ్చించడంలో నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. భవిష్యత్‌లో మరో 40 సంవత్సరాల వరుకు ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందేలా శాశ్వత చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పేరుపాలెం నార్త్, కేపీ పాలెం నార్త్ సర్పంచ్‌లు పేరుపాలెం వెంకన్న, కడలి సోంబాబు, జడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, ఎంపీపీ అందే సూర్యావతి భుజంగరావు, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కొమ్మారి సూరయ్య నాయుడు, డీవివి సత్యనారాయణ, నాయకులు కర్రి ఏసుబాబు, ఆండ్రాజు చల్లారావు, చల్లా రాజా, కంచర్ల బాబులు, కవురు సాయి, ఆముదాలపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు,

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు

నరసాపురం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా వలంటీర్లు పనిచేయాలని ప్రభ్యుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం ముదునూరి తన కార్యాలయంలో నరసాపురం మండలం సరిపల్లి గ్రామ వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. వలంటీర్లు అర్హులైన ప్రతీ ఒక్కరికి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేటట్టు చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడేరు గ్రామనికి చెందిన చిట్టుగొల్ల విద్యాసాగర్ శ్మశాన వాటిక చిన్న బడ్డీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం 10 గంటల సమయంలో చిట్టుగొల్ల విద్యాసాగర్ కొట్టులో సరుకులు అమ్ముకుంటుండగా అదే గ్రామానికి చెందిన పిట్టా కుమార్ వచ్చి సరుకు అడగగా ఇద్దరికి మాట మాట పెరగడంతో పిట్టా కుమార్ బీర్ బాటిల్‌ను బడ్డీ కొట్టుకేసి కొట్టి పగలగొట్టి చిట్టుగొల్ల విద్యాసాగర్‌పై దాడి చేయడంతో కాలుకి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో విద్యాసాగర్‌ను స్థానికులు, బంధువులు భీమవరంలోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చిట్టుగొల్ల విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు అలంపురంలో ఉచిత వైద్య శిబిరం

పెంటపాడు: మండలం అలంపురం గ్రామంలో గురువారంవెంకట రమణ సేవాఛారిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, పల్మనాలజీ, చెవి, ముక్కు, గొంతు డాక్టర్లు వచ్చి రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. దీంతోపాటు, గుండె వ్యాధులకు సంబంధించి ఈసీజీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉచితంగా తీస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాయకుదురులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయకుదురులో ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ ,షుగర్, థైరాయిడ్, ఫీవర్ తదితర పరీక్షలు నిర్వహించి వైద్యపరమైన అవగాహన కల్పించారు. సర్వే పూర్తయిన అనంతరం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ సెంటర్ వైద్యులు పాలా లీల, డి.ఈశ్వరి, సానబోయిన మావుళ్ళమ్మ, బి.దుర్గాభవాని పాల్గొన్నారు.

మేడిది జాన్సన్‌ను క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్‌ను కృష్ణా జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మేడిది జాన్సన్ వారితో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో కృష్ణా జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జయరాజు, జోనల్ ఇన్‌చార్జి విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన వీరవల్లి సాయికిరణ్- శ్రీలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు 4 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆకివీడు: పౌష్టికాహారాన్ని పిల్లలకు క్రమం తప్పకుండా అందజేసినప్పుడే మెరుగైన ఆరోగ్యం, పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని ఎంపీపీ కఠారి జయలక్ష్మి అన్నారు. మండలంలోని తరటావ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, చదువు పట్ల పిల్లల ఆసక్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త మల్లారెడ్డి భానుతో మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. కేంద్రానికి ప్రతి రోజూ పిల్లలంతా వచ్చేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అందజేసే పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలన్నారు.

నేడు, రేపు మండలస్థాయి స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్

నరసాపురం రూరల్: మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ సెలెక్షన్లు బుధ, గురువారాల్లో మండలంలోని ఎల్బీచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ పిల్లి పుష్పరాజ్యం తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ సెలక్షన్స్‌లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. అండర్17, అండర్14 విభాగాలలో జరిగే ఈ టోర్నమెంట్ కం సెలెక్షన్లలో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, బ్యాట్‌మెంటెన్ క్రీడా పోటీలు నిర్వహిస్తారని ఆమె వివరించారు. ఈ పోటీలకు మండల ఇన్‌చార్జిగా వ్యాయామోపాధ్యాయుడు కేవీ శేఖర్ వ్యవహిస్తారన్నారు.